



రక్షణ కల్పించాలి..

ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలలో పనిచేస్తున్న సిబ్బందికి రక్షణ కల్పించాలి. ప్రతి పీహెచ్‌సీలో సెక్యూరిటీ గార్డును నియమించాలి. 24 గంటల ఆస్పత్రుల్లో రాత్రిపూట విధులు నిర్వహించే సమయంలో ఆకతాయిలతో ఇబ్బంది పడుతున్నాం. దాడులు జరుగుతున్నప్పుడు మాత్రమే ఇటువంటి చర్చ జరుగుతోంది తప్ప శాశ్వత నివారణ చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయి. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన నిర్ణయాలు తీసుకోవాలి.

– ఎస్. ప్రమీలాదేవి, వైద్యాధికారి
పూసపాటిరేగ పీహెచ్‌సీ

వైద్యులను అర్థం చేసుకోవాలి

రోగులు రకరకాల ఆరోగ్య సమస్యలతో ఆస్పత్రులకు వస్తారు. వారి ప్రాణాలను కాపాడాలనే వైద్యులు చూస్తారు. వైద్యుల పరిస్థితిని అర్థం చేసుకోవాలి. కర్ణాటక రాష్ట్రంలో వలే వైద్యులపై దాడులు జరిగితే నాన్ బెయిల్‌బుల్ కేసు పెట్టాలని అసెంబ్లీలో తీర్మానం చేయాలి. క్యాజువాలటీ వద్ద ఉదయం, రాత్రి పోలీస్ భద్రత ఏర్పాటు చేయాలి. మహిళల వార్డులో మహిళా పోలీస్‌ను ఏర్పాటుచేస్తే భద్రతగా ఉంటుంది.

– డాక్టర్ బొత్స సంతోష్‌కుమార్,
అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి



క్లుప్తంగా

వైభవంగా సహస్ర దీపాలంకరణ



సీతారామస్వామికి ఊంజల్ సేవ జరిపిస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో సహస్ర దీపాలంకరణ కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. సాయంత్రం ఆరు గంటలకు మంగళవాయిద్యాల నడుమ సీతారామస్వామి ఉత్సవ విగ్రహాలను దీపారాధన మంటపానికి ఊరేగింపుగా తీసుకువచ్చి, ప్రత్యేక ఊయలలో ఉంచి పూజలు చేవారు. అనంతరం దీపాలు వెలిగించి శ్రీరామచంద్రస్వామికి ఊంజల్ సేవ జరిపించారు. కార్యక్రమంలో అర్చకులు నరసింహాచార్యులు, కిరణ్, రామగోపాల్, భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య



విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా గిరిజన సంక్షేమ శాఖాధికారి రామానందం

నెల్లిమర్ల: గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి బోని రామానందం సూచించారు. శుక్రవారం ఆయన స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బోధన, భోజనం వివరాలపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పదో తరగతి విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రణాళికాబద్ధంగా బోధన చేపట్టాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం కర్రి సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పెట్టుబడి నైపుణ్యాలపై అవగాహన



అసోసియేట్ ప్రొఫెసర్ బలరాంను సత్కరిస్తున్న నిర్వాహకులు

విజయనగరం అర్బన్: కళాశాల విద్యార్థి దశ నుంచే ఆర్థిక అక్షరాస్యత, పెట్టుబడి నైపుణ్యాల పెంపుపై అవగాహన పెంచుకోవాలని ఆదిత్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీస్ అండ్ మేనేజ్‌మెంట్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ బి.బలరాం అన్నారు. శుక్రవారం స్థానిక గాజులరేగ సీతం ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో స్టాక్ మార్కెట్ అంశంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచి స్టాక్ మార్కెట్‌లోని రిస్క్ మేనేజ్‌మెంట్‌పై అవగాహన కల్పించుకోవాలని సూచించారు. స్టాక్ మార్కెట్ అవగాహన వల్ల ఆర్థిక పరిజ్ఞానం, నిర్ణయాత్మక నైపుణ్యాలు మెరుగుపడతాయని చెప్పారు. అనంతరం ముఖ్య అతిథిని ఘనంగా సత్కరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీ రామ్మూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు, డిపార్ట్‌మెంట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ హెచ్ఓడీ డాక్టర్ ఎస్. వరూధిని, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిశోధనా దృక్పథం పెంచుకోవాలి

విజయనగరం అర్బన్: విద్యార్థి దశ నుంచే పరిశోధనా దృక్పథాన్ని పెంచుకోవాలని మహారాజా అటానమస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎం.సాంబశివరావు అన్నారు. శుక్రవారం స్థానిక మహారాజా అటానమస్ కళాశాలలో నేషనల్ స్పేస్ డే ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థీ కళాశాల దశ నుంచే అంతరిక్ష టెక్నాలజీ, సైంటిఫిక్ టెంపర్‌మెంట్‌ని అభివృద్ధి చేసుకుని, పరిశోధనలకు అనుగుణంగా అవగాహన ఏర్పరచుకోవాలని సూచించారు. భౌతికశాస్త్ర విభాగాధిపతి పి.సత్యనారాయణరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముందుగా భౌతిక శాస్త్ర విభాగంలో వివిధ కళాశాలల విద్యార్థులు, అధ్యాపకులకు క్విజ్, సెమినార్, పీపీటీ, తదితర పోటీలను నిర్వహించారు. కార్యక్రమం కోఆర్డినేటర్‌గా పీఎస్ ఫణికుమార్, అధ్యాపకులు ఆనంద, వీవీ లక్ష్మి, శ్రీనివాస్, చిన్నంనాయుడు, శ్రవణ్, సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం ప్రమాదంపై విచారణ చేపట్టాలి..

- సీఐటీయూ నాయకుల డిమాండ్

నెల్లిమర్ల: అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం ఎసెన్సియ ఫార్మా కంపెనీలో రియాక్టర్ పేలి చనిపోయిన 18 మంది కార్మికులకు న్యాయం చేయడంతో పాటు ప్రమాదంపై విచారణ చేపట్టాలని సీఐటీయూ నగర ఉపాధ్యక్షుడు రెడ్డి శంకరరావు డిమాండ్ చేశారు. సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం స్థానిక ఏపీ బేవరేజెస్ వద్ద కార్మికులతో కలిసి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మృతుల ఇంటిలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, క్షతగాత్రులకు రూ. 50 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో బి. రమణ, శ్రీను, కార్తీక్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి మూడు నెలలకు గ్రామసభలు..

- కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్



విజయనగరం: దుప్పాడలో నిర్వహించిన గ్రామసభలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం: జిల్లాలోని ప్రతి గ్రామ పంచాయతీలో మూడు నెలలకోసారి గ్రామసభలు నిర్వహించాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అన్నారు. విజయనగరం మండల పరిధిలో గల 22 గ్రామ పంచాయతీల్లో శుక్రవారం గ్రామసభలు నిర్వహించారు. ఇందులో భాగంగా దుప్పాడలో జరిగిన గ్రామసభకు కలెక్టర్‌తో పాటు స్థానిక ఎమ్మెల్యే పూసపాటి అదితిగజపతిరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ అంబేడ్కర్ మాట్లాడుతూ.. గ్రామసభలో గ్రామ ప్రజలంతా తప్పనిసరిగా పాల్గొని గ్రామ సమస్యలు, ఉపాధి నిధులతో చేపట్టాల్సిన పనులు, తదితర అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకోవాలన్నారు. ప్రతి వ్యక్తీ గ్రామ అభివృద్ధి కోసం కొంత సమయాన్ని కేటాయించాలని సూచించారు. గ్రామ పంచాయతీ అభివృద్ధికి సంబంధించి ఎలాంటి పనులు చేపట్టాలనే అంశంపై నిర్ణయాలు తీసుకొనే అధికారం గ్రామసభలకే ఉంటుందని, ప్రభుత్వ యంత్రాంగం గ్రామసభల్లో తీసుకున్న నిర్ణయాలను ఆమోదించి వాటిని అమలు చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, నోడల్ అధికారి అరుణకుమారి, ఎంపీటీసీ సభ్యురాలు కృష్ణవేణి, సర్పంచ్ లక్ష్మి, టీడీపీ నాయకుడు కిమిడి నాగార్జున, జనసేన పార్టీ నాయకులు పాలవలస యశస్విని, తదితరులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి...

నెల్లిమర్ల రూరల్: గ్రామాల్లో వలసలను నివారించాలన్న ఏకైక లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉపాధి హామీ పథకాన్ని వేతనదారులు సద్వినియోగపరుచుకోవాలని వైస్ ఎంపీపీ సారిక వైకుంఠంనాయుడు సూచించారు. మండలంలోని అలుగోలు సచివాలయంలో ఉపాధి హామీ పనుల గుర్తింపు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2024–25 ఆర్థిక సంవత్సరానికి పూర్తి స్థాయిలో పనులు గుర్తించి వేతనదారులకు ఉపాధి కల్పించాలన్నారు. వేతనాలు పెండింగ్ లేకుండా బ్యాంక్ ఖాతాల్లో జమయ్యేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ అలుగోలు బంగారమ్మ, కార్యదర్శి రామ్‌జీ, గ్రామపెద్దలు దివాకర్, ఆదినారాయణ, అధికారులు పాల్గొన్నారు.

అవసరానికి తగిన పనులు..

డెంకాడ: గ్రామ అవసరాలకు తగ్గట్టు ప్రజలే పనులు ఎంపిక చేసుకోవడం వల్ల మంచి ప్రయోజనం ఉంటుందని ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు అన్నారు. మండల వ్యాప్తంగా ఉపాధి పనుల గుర్తింపు గ్రామసభలు నిర్వహించారు. మోపాడ గ్రామంలో జరిగిన గ్రామసభలో ఆయన మాట్లాడుతూ, గ్రామంలోని ఉపాధి వేతనదారులకు పని కల్పించడంతో పాటు ఆ పనులు ప్రయోజనకరంగా ఉండేలా చూసుకోవాలన్నారు. మండల ప్రత్యేకాధికారి జమదగ్ని, ఎంపీడీఓ డీడీ స్వరూపారాణి మండలంలో జరిగిన పలు గ్రామసభల్లో పాల్గొన్నారు. కార్యక్రమాల్లో ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



నెల్లిమర్ల రూరల్: అలుగోలులో ఉపాధిహామీ పనుల గుర్తింపుపై గ్రామసభ



పూసపాటిరేగ: కనిమెల్ల గ్రామసభలో వాదులాడుకుంటున్న సభ్యులు

కనిమెల్ల గ్రామసభ రసాభాస..

పూసపాటిరేగ : మండలంలోని కనిమెల్ల జరిగిన గ్రామసభ రసాభాసగా మారింది. ప్రభుత్వ భూముల ఆక్రమణలపై కూటమి, ప్రతిపక్ష నాయకుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. కనిమెల్లలో కార్యదర్శి రవికుమార్ అధ్యక్షతన గ్రామసభ జరిగింది. సభను నిర్వహించాల్సిన గ్రామ ప్రత్యేకాధికారి డుమ్మా కొట్టడంతో కార్యదర్శి సభను నిర్వహించారు. తిరుమలగెడ్డ చానల్‌కు సంబంధించి కాలువ తవ్వకాలు చేపట్టాలని ప్రజాప్రతినిధులు డి. సూర్యనారాయణరాజు, మాజీ సర్పంచ్ ఎస్. అప్పలస్వామినాయుడు, డి.సూర్యారావు, ఎస్. రమేష్ సభ దృష్టికి తీసుకువచ్చారు. గ్రామంలో ప్రభుత్వ భూములు, వాగులు, చెరువుల్లో చోటుచేసుకున్న ఆక్రమణలను తొలగించాలని సర్పంచ్ నడిపేన రమణ తెలిపారు. ఈ సమయంలో కూటమి నాయకులు, ప్రతిపక్ష నాయకులు భూములు మీరు ఆక్రమించుకున్నారంటే.. మీరని ఒకరిపై ఒకరు దెమ్మెత్తిపోసుకున్నారు. కామవరం, కనిమెల్ల గ్రామాలకు తాగునీరు అందడం లేదని పలువురు గ్రామస్తులు అధికారులకు తెలియజేశారు. గ్రామంలో రక్షిత మంచినీటి పథకం పరిమాణం చాలనందున మరో ట్యాంకు నిర్మించినట్లయితే తాగునీటికి ఇబ్బంది ఉండదని సర్పంచ్ రమణ తెలిపారు. సభలో ఉపాధిహామీ పథకానికి సంబంధించిన పనులపై కనీసం చర్చ చేపట్టకుండా, వ్యక్తిగత ఆరోపణలకే ప్రాధాన్యం ఇవ్వడంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, సచివాలయం సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.



డెంకాడ: మోపాడ సభలో మాట్లాడుతున్న ఎంపీపీ వాసుదేవరావు

రుణాలు అందించడమే లక్ష్యం..

- తహసీల్దార్ గోవింద



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ గోవింద

పూసపాటిరేగ: సీసీఆర్‌సీ రుణాలు పూర్తిస్థాయిలో అందించడమే లక్ష్యమని తహసీల్దార్ తాడ్డి గోవింద అన్నారు. శుక్రవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో వీఏలు, సర్వేయర్లు, వీఆర్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పూసపాటిరేగ మండలానికి సంబంధించి కోటీ 39 లక్షల రుణం లక్ష్యం కాగా ఇప్పటివరకు రూ. 10.69 లక్షలు కౌలురైతులకు రుణాలుగా అందజేసినట్లు తెలిపారు. మండల పరిధిలో 383 మంది కౌలురైతులకు కార్డులు పంపిణీ చేయగా.. భూయజమాని అనుమతితో 16 మంది రైతులకు రుణాలు మంజూరు చేసినట్లు చెప్పారు. 4,932 ఎకరాలు సాధారణ సాగు విస్తీర్ణం కాగా ఇప్పటివరకు 2,948 ఎకరాల్లో నాట్లు పడ్డాయన్నారు. రీ సర్వేలో బీడు భూములు, వ్యవసాయానికి పనికివచ్చే భూములు, ప్రభుత్వ భూములు, ప్రభుత్వ బంజరు భూములను గుర్తించాలని సూచించారు. అలాగే ఈ – పంట నమోదును త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కె. నీలిమ, ఉద్యానవనశాఖ అధికారి జ్యోత్స్న, సీఎస్‌డీటీ మురళి, తదితరులు పాల్గొన్నారు.

శ్రావణ శోభ..

- ప్రత్యేక అలంకరణలో పైడితల్లి
- సంతోషిమాత ఆలయానికి పోటెత్తిన భక్తులు
- కన్యకా పరమేశ్వరికి ప్రత్యేక పూజలు

విజయనగరం టౌన్: శ్రావణమాసం మూడో శుక్రవారాన్ని పురస్కరించుకుని పట్టణంలోని దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి పైడితల్లి అమ్మవారికి వేకువజాము నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అరటి ఆకులు, వివిధ రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. మహిళలు అమ్మవారిని దర్శించుకుని పసుపు, కుంకుమలు సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ ఈఓ డీవీవీ ప్రసాదరావు కార్యక్రమాలను పర్యవేక్షించారు. అదేవిధంగా స్థానిక మయూరీ జంక్షన్ వద్ద నున్న సంతోషిమాత ఆలయంలో ఆలయ అర్చకులు రమేష్ తివారీ నేతృత్వంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. మహిళలు అమ్మవారి దర్శనం కోసం బారులు తీరారు. కన్యకా పరమేశ్వరి అమ్మవారు బంగారు చీర, వజ్రకిరీట ధారణతో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ చైర్మన్ నారాయణం శ్రీనివాస్ కార్యక్రమాలను పర్యవేక్షించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న పైడితల్లి



వివిధ రకాల పండ్ల అలంకణలో భక్తులకు దర్శనమిస్తున్న కన్యకా పరమేశ్వరి

దివ్యాంగ విద్యార్థుల అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న సమగ్ర శిక్ష రాష్ట్ర సహిత విద్య విభాగం కన్సల్టెంట్ డాక్టర్ నరసింహం

విజయనగరం అర్బన్: దివ్యాంగ విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని సమగ్ర శిక్ష రాష్ట్ర సహిత విద్య విభాగం కన్సల్టెంట్ డాక్టర్ నరసింహం, రాష్ట్ర సహిత విద్య సమన్వయకర్త డాక్టర్ ఎస్.అమ్మినాయుడు అన్నారు. శుక్రవారం స్థానిక డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో దివ్యాంగుల విద్యలో ట్యాబ్‌ల వినియోగంపై సహిత విద్య రిసోర్స్‌పర్సన్‌కు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దివ్యాంగుల్లో అభ్యాస ఫలితాలను రాబట్టేందుకు దివ్యాంగ విద్యార్థులకు సమగ్ర శిక్ష ద్వారా ట్యాబ్‌లను పంపిణీ చేసిందన్నారు. ఇందులో ప్రత్యేక సాఫ్ట్‌వేర్ అప్‌లోడ్ చేయడం వల్ల దివ్యాంగులకు ఎంతో ఉపయోగకరంగా మారనున్నాయని చెప్పారు. శిక్షణను జిల్లా సహిత విద్య సమన్వయకర్త ఎస్.సూర్యారావు పర్యవేక్షించగా రిసోర్స్‌పర్సన్స్‌గా పి.సునీల్‌కుమార్, బి.మహాలక్ష్మినాయుడు వ్యవహరించారు. కార్యక్రమంలో జిల్లా సహ సమన్వయంకర్త ఎం.భారతి, సహిత విద్య రిసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.

గుడ్ అండ్ బ్యాడ్ టచ్‌పై అవగాహన



కార్యక్రమంలో మాట్లాడుతున్న కొండమ్మ

విజయనగరం ఫోర్ట్: విద్యార్థినులు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కలిగి ఉండాలని ఆర్‌కేఎస్‌కే కౌన్సిలర్ అంబళ్ల కొండమ్మ అన్నారు. నగరంలోని మహారాణిపేట గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ, విద్యార్థినులు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. నెలసరి సమయంలో వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. మంచి పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. కా ర్యక్రమంలో హెచ్ఎం ఎస్. ఉమాలక్ష్మి, ఏఎస్ఎం కె. సుభాషిణి, తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతో నివారణ..

డెంకాడ: అవగాహనతో హెచ్ఐవీ, ఎయిడ్స్‌ను నియంత్రించవచ్చని చైల్డ్ ఫర్ ఇండియా లింక్ వర్కర్ సంస్థ ప్రతినిధి ఎ.ఉత్తంనాయుడు అన్నారు. జిల్లా వైద్యారోగ్యశాఖ ఆదేశాల మేరకు మండలంలోని చింతలవలస గ్రామంలో హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై ప్రజలకు శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సురక్షితం కాని లైంగిక కలయిక, రక్తమార్పిడి వల్ల ఇటువంటి వ్యాధులు సంక్రమిస్తాయని చెప్పారు. సర్పంచ్ సిరుగుడి ఎరకమ్మ, సెక్రటరీలు ఎస్. రమణారావు, పలువురు సచివాలయ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణ జన్మాష్టమికి ఏర్పాట్లు పూర్తి



ఉత్సవ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సంస్థ ప్రతినిధులు వానపల్లి శంకరరావు, తదితరులు

విజయనగరం టౌన్: శ్రీకృష్ణ భగవానుడు తెలియజేసిన నిజ భావాలు.. జీవాత్మ, పరమాత్మ విధానాలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని ప్రబోధా సేవా సమితి, ఇందూ జ్ఞానవేదిక జిల్లా శాఖ అధ్యక్షుడు వానపల్లి శంకరరావు అన్నారు. శుక్రవారం స్థానిక గురజాడ కళాభారతి ఆడిటోరియంలో ఈ నెల 26 నుంచి 30 వరకు నిర్వహించనున్న శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలకు సంబంధించిన కరపత్రాలను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లా కేంద్రంతో పాటు బొద్దాం, రాజాం, గజపతినగరం, బొబ్బిలి, నెల్లిమర్ల ప్రాంతాల్లో ఈ వేడుకలు ఘనంగా నిర్వహించనున్నామని తెలిపారు. విజయనగరం గురజాడ కళాభారతిలో నిర్వహించనున్న ముగింపు ఉత్సవాలకు మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే అదితి గజపతిరాజు హాజరుకానున్నారన్నారు. కార్యక్రమంలో సభ్యులు సీవీఎస్.నాయుడు, ప్రసాద్, ఆదినారాయణ, జగన్నాథం, సూరిబాబు, కోటి, దుర్గారావు, రాజేష్, ఉపేంద్ర, వెంకీ, తదితరులు పాల్గొన్నారు.

టంగుటూరి సేవలు ఎనలేనివి..



డెంకాడ: ఆకులపేటలో నివాళులర్పిస్తున్న ఎంపీడీఓ స్వరూపారాణి

డెంకాడ: స్వాతంత్య్ర సమరయోధుడు, ఆంధ్రప్రదేశ్ తొలి ముఖ్యమంత్రి టంగుటూరు ప్రకాశం పంతులు అందించిన సేవలు మరువలేనివని ఎంపీడీఓ స్వరూపారాణి అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం, ఆకులపేట గ్రామంలో టంగుటూరి జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో సర్పంచ్ సువ్వాడ రమేష్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

టంగుటూరి ఆశయాలు భవిష్యత్‌తరాలకు ఆదర్శం..

విజయనగరం: స్వాతంత్య్ర సమరయోధుడు టంగుటూరి ప్రకాశం పంతులు ఆశయాలు భవిష్యత్ తరాలకు ఆదర్శప్రాయమని విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ తిరుమలరావు అన్నారు. టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని పురస్కరించుకుని కార్పొరేషన్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆంధ్రరాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా ప్రకాశం పంతులు ఎనలేని సేవలు అందించారన్నారు. నిరుపేద కుటుంబంలో జన్మించి, వారాలు చేసుకుంటూ చదువుకుని విద్యావేత్తగా, రాజకీయ నేతగా ఎదిగి ఆంధ్రరాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా సేవలందించారని కొనియాడారు. ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర సాధనకు ఎంతో పోరాటం చేశారన్నారు. అలాగే చెన్నైలో సైమన్ కమిషన్ వ్యతిరేక ప్రదర్శనలో తుపాకీలకు ఎదురేగిన ధైర్యశీలి అని కొనియాడారు. కార్యక్రమంలో కార్పొరేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



విజయనగరం: టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు

వైద్యరంగాన్ని ప్రక్షాళన చేయండి

- వైద్యారోగ్యశాఖా మంత్రిని కోరిన బవిరెడ్డి



ఆరోగ్యశాఖా మంత్రి సత్యకుమార్‌తో బవిరెడ్డి శివప్రసాదరెడ్డి, తదితరులు

విజయనగరం టౌన్: రాష్ట్రంలో ఎన్‌డీఏ ప్రభుత్వం అధికారం చేపట్టి మూడు నెలలు కావస్తున్నా జిల్లా వైద్యాధికారులలో ఎటువంటి చైతన్యం లేదని.. వైద్యరంగాన్ని ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందని బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు, పార్టీ మాజీ జిల్లా అధ్యక్షుడు బవిరెడ్డి శివప్రసాదరెడ్డి అభిప్రాయపడ్డారు. ఈ మేరకు పార్వతీపురం మన్యం జిల్లాలో ఒక రోజు పర్యటనకు వచ్చిన రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖా మంత్రి వై.సత్యకుమార్‌ను జెడ్పీ అతిథి గృహంలో పార్టీశ్రేణులతో శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా కేంద్రానికి తలమానికమైన మహారాజా ప్రభుత్వ ఆస్పత్రిలో లక్షల రూపాయల కేంద్ర ప్రభుత్వ నిధులతో కొనుగోలు చేసిన వైద్య పరికరాలు పర్యవేక్షణ లేక మూలకు చేరాయన్నారు. ప్రజలందరికీ సౌకర్యవంతమైన వైద్యమందే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

జిల్లాకు క్యాన్సర్ ఆస్పత్రి మంజూరు చేయండి

- లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ



మంత్రి సత్యకుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బాబ్జీ, తదితరులు

విజయనగరం ఫూల్‌బాగ్: ఉత్తరాంధ్ర ప్రజలు క్యాన్సర్లతో మృత్యువాత పడుతున్నారని, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి విజయనగరం జిల్లాకు ప్రభుత్వ క్యాన్సర్ ఆస్పత్రిని మంజూరు చేయాలని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ కోరారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ అతిథిగృహంలో రాష్ట్ర వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. మంత్రిని కలిసిన వారిలో ఇప్పలవలస గోపి, డాక్టర్ జేసీ నాయుడు, తదితరులున్నారు.

సమస్యలపై వినతిపత్రం

విజయనగరం ఫోర్ట్: రాష్ట్ర ఆరోగ్యశాఖా మంత్రి సత్యకుమార్‌యాదవ్‌ను ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ముర్రు జయచంద్రనాయుడు (జేసీ నాయుడు) కలిసి వైద్యుల సమస్యలపై వినతి పత్రం ఇచ్చారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మాదిరి వైద్యుల నుంచి కూడా ఒకరికి ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో డాక్టర్ వీఎస్ ప్రసాద్, డాక్టర్ వెంకటేశ్వరరావు, తదితరులున్నారు.

కానిస్టేబుల్‌పై దాడి

విజయనగరం క్రైమ్: డయల్ 100కి వచ్చిన కాల్ ఆధారంగా సంఘటనా స్థలానికి వెళ్లిన కానిస్టేబుల్‌పై దుండగులు రాళ్లతో దాడిచేశారు. దీనికి సంబంధించి టూటౌన్ సీఐ శ్రీనివాసరావు శుక్రవారం అందించిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక ఫూల్‌బాగ్ బిట్ 4లో న్యూసెన్స్ జరుగుతోందని డయల్ 100కి కాల్ రావడంతో కానిస్టేబుల్ కృష్ణతో పాటు మరో బ్లూకార్ట్ హెచ్‌సీ సంఘటనా స్థలానికి శుక్రవారం వెళ్లారు. అక్కడ న్యూసెన్స్ చేస్తున్న వారిని ఇదేం పని అని ప్రశ్నించగా..దుండగులు కానిస్టేబుల్ కృష్ణపై రాళ్లతో దాడి చేశారు. కృష్ణ తలకు గాయం కావడంతో పక్కనే ఉన్న హెచ్‌సీ జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. దాడి చేసిన వారిలో పిన్నింటి గోవిందరావు, ఆదపాక పండు, బడే జగదీష్, పడగడ రాకేష్ ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏడుగురు అరెస్ట్..

విజయనగరం క్రైమ్: టూటౌన్ పరిధిలోని కమ్మవీధి, బాబామెట్ట, గొడ్డువీధి, ఫూల్‌బాగ్, తదితర ప్రాంతాల్లో గంజాయి సేవిస్తున్న ఏడుగురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు టూటౌన్ సీఐ శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. నిషేధిత మత్తు పదార్థాలు విక్రయించినా, సేవించినా చర్యలు తప్పవన్నారు.